సాక్షి నల్లగొండ

మంగళవారం, 2, జనవరి, 2024



మంత్రి పొంగులేటికి స్వాగతం

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి సోమవారం నకిరేకల్‌లో ఘన స్వాగతం పలికారు. - 10లో



ముగిసిన నెట్‌బాల్ పోటీలు

నాగార్జునసాగర్‌లో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి జూనియర్ నెట్‌బాల్ పోటీలు సోమవారంతో ముగిశాయి. - 10లో



మత్స్యకారులపై పట్టింపేది..!

డిండి ప్రాజెక్టులో చేపల వేటనే జీవనాధారంగా జీవిస్తున్న మత్స్యకారులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. - 10లో

న్యూస్‌రీల్

జిల్లా ప్రగతికి పాటుపడాలి

నల్లగొండ : నూతన సంవత్సరంలో వినూత్న ఆలోచనలతో జిల్లా అభివృద్ధి, ప్రగతికి కృషి చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆకాంక్షించారు. నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, ప్రజలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓలు రవి, చెన్నయ్య, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కందుకూరి వెంకటేశ్వర్లు, డీపీఓ విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎల్.శ్రీనివాస్, బీసీ అభివృద్ధి అధికారి ఖాజానజీంఅలీ, డీఆర్‌డీఓ కాళిందిని, గనులు, భూగర్భ శాఖ సహాయ సంచాలకులు వెంకటేశ్వర్‌రావు, డీడబ్ల్యూఓ కృష్ణవేణి, డీపీఆర్ఓ పి.శ్రీనివాస్, టీఎన్‌జీఓ అధ్యక్షుడు శ్రావణ్ పాల్గొన్నారు.

ఇనుపాముల యువతికి డాక్టరేట్



శ్రీదేవి

కేతేపల్లి: మండలంలోని ఇనుపాముల గ్రామానికి చెందిన సంద శ్రీదేవి ఉస్మానియా యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. ఇనుపాముల గ్రామానికి చెందిన సంద బాలయ్య–తెరోజమ్మ ఏడో సంతానం అయిన శ్రీదేవి ఎంబీఏ పూర్తి చేసింది. అనంతరం ఉస్మానియా యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ ఆర్.సంపత్‌కుమార్ పర్యవేక్షణలో 'ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో మహిళలు, కెరీర్ పురోగతిలో ఎదుర్కొంటున్న అడ్డంకులు'అనే అంశంపై పరిశోధన చేసి ఉస్మానియా యూనివర్సిటీ అధికారులకు అందజేశారు. పరిశోధనలో భాగంగా దుబాయిలో జరిగిన సదస్సులో శ్రీదేవి తన ఉపన్యాసంతో అక్కడి ప్రజల మెప్పు పొందారు. శ్రీదేవి ప్రస్తుతం హైదరాబాద్‌లోని లిటిల్‌ఫ్లవర్ జూనియర్ కళాశాలలో కామర్స్ అధ్యాపకురాలిగా పని చేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బ్యాంక్ అధికారులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలో వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా పలు బ్యాంకుల అధికారులు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సోమవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, ఎస్‌బీఐ, కెనరా బ్యాంకు అధికారులు పాల్గొని మాట్లాడారు. ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం, ఇళ్లు, ఉచిత వైద్యంతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. అనంతరం వికసిత్ భారత్ సంకల్పయాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సందీప్, ఫీల్డ్ ఆఫీసర్ హరి, కెనరా బ్యాంకు మేనేజన్ భిక్షమాచారి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాస్‌రావు, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్ మామిడాల శ్రీనివాస్‌చారి, హెచ్‌పీ గ్యాస్ డీలర్ ప్రతాప్ తదితరులున్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో ఆదివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. ఉదయాన్నే ఆలయాన్ని తీసిన ఆచార్యులు సుప్రభాతం, ఆరాధన సేవ నిర్వహించారు. అనంతరం నిజాభిషేకం, అర్చన వంటి పూజలు చేపట్టారు. ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు చేపట్టారు. సాయంత్రం ఆలయంలో జోడు సేవను భక్తజనం సందోహం మధ్య ఊరేగించారు. రాత్రికి శ్రీస్వామి అమ్మవార్లకు శయనోత్సవం నిర్వహించి, ఆలయ ద్వార బంధనం చేశారు.



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు





'నూతన' వేడుక

కలెక్టరేట్‌లో నూతన సంవత్సర కేక్ కట్ చేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

నల్లగొండలోని పానగల్ ఛాయా సోమేశ్వరాలయంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు



నారుమడిలో నారీమణులు

శాలిగౌరారంలో వరి నారుమడి వద్ద నూతన సంవత్సర కేక్‌ను కట్ చేస్తున్న మహిళా కూలీలు

మహిళలు, పిల్లల భద్రతకు ప్రాధాన్యం

ఫిర్యాదులకు వాట్సప్ నంబర్ అందుబాటులోకి తెస్తాం

- మత్తు పదార్థాల రవాణాపై ఉక్కు పాదం మోపుతాం
- రోడ్డు భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తాం
- దౌర్జన్యాలు, రౌడీయిజాన్ని రూపుమాపుతాం
- బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ చందనా దీప్తి వెల్లడి



మాట్లాడుతున్న నూతన ఎస్పీ చందనా దీప్తి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : జిల్లాలో మహిళలు, పిల్లల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తామని ఎస్పీ చందనా దీప్తి వెల్లడించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఆమె మీడియాతో మాట్లాడారు. జిల్లాలో బేసిక్ పోలీసింగ్‌ను బలోపేతం చేస్తామని, ప్రతి సోమవారం గ్రీవెన్స్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. ప్రజలకు ప్రొఫెషనల్ పోలీసింగ్ అందించడమే లక్ష్యంగా పని చేస్తామని, ప్రజలు నిర్భయంగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసేలా నమ్మకం కలిగిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ వెల్లడించిన మరిన్ని అంశాలు ఆమె మాటల్లోనే..

దూర ప్రాంతాల వారికోసం

ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు ఫిర్యాదు చేయవచ్చు. ఆన్‌లైన్ ద్వారా కూడా తమ సమస్యను తెలియజేసి పరిష్కారం పొందేలా చర్యలు చేపడతాం. త్వరలోనే వాట్సప్ నంబర్‌ను అందుబాటులోకి తీసుకొస్తాం. ప్రజలు ఆ నంబర్‌కు తమ ఫిర్యాదును పంపించవచ్చు.

డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం

పదేళ్ల కిందట నేను ఇక్కడే ఏఎస్పీగా పని చేశా. జిల్లాపై అవగాహన ఉంది. ప్రొఫెషనల్‌గా సేవలు అందిస్తా. నార్కొటిక్ డ్రగ్స్, గంజాయి సంబంధిత యాక్టివిటీ, రవాణా, అమ్మకాలపై ఉక్కుపాదం మోపుతాం. మత్తు పదార్థాల వల్ల అనేక కుటుంబాలు దెబ్బతింటున్నాయి. అందుకే వాటిని కట్టడి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడతాం. జిల్లాలో దౌర్జన్యం, రౌడీయిజం వంటి వాటిని సహించం. చట్ట విరుద్ధమైన, క్రిమినల్ చర్యలపై కఠినంగా వ్యవహరిస్తాం. రౌడీయిజం లేకుండా చేస్తాం.



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్పీ చందనాదీప్తి

భూతగాదాల్లో మితిమీరిన జోక్యం వద్దు

జిల్లాలో బాగా పని చేసే పోలీసులకు రివార్డులు ఇస్తాం. చెడుగా వ్యవహరించే వారిని శిక్షిస్తాం. భూతగాదాలు జిల్లాలో ఎక్కువగా ఉన్నాయి. ఈ కేసులను చట్టపరంగా విచారణ చేయాలి. పోలీసులు ఏం చేయాలి.. ఏం చేయకూడదు అనే అంశాలపై అవగాహన కల్పిస్తాం. చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం. పోలీసుల జోక్యంపై గతంలో జరిగిన సంఘటనలను పరిశీలిస్తాం.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

వాహనాలు పెరగడం వల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయి. రోడ్డు ఇంజనీరింగ్ లోపాలతో కూడా ప్రమాదాలు జరుగుతాయి. వాటిని మార్చడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే వారిపై చర్యలు చేపడతాం.

పెద్ద ఎత్తున సీసీ కెమెరాల ఏర్పాటు

దొంగతనాలు వంటి కేసులపై ప్రత్యేక చర్యలు చేపడతాం. డిటెక్షన్, రికవరీపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. మిషన్ మోడ్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పిస్తాం. ఇంట్లో సీసీ కెమెరా ఉంటే దొంగతనం చేయడానికి దొంగలు భయపడతారు. ప్రస్తుతం జిల్లాలో ఎక్కడెక్కడ సీసీ కెమెరాలు ఉన్నాయి.. ఎన్ని పని చేస్తున్నాయి. ఎన్ని పని చేయడం లేదనే వాటిని పరిశీలించి మరమ్మతు చేయిస్తాం. కమ్యూనిటీ కెమెరాలే కాకుండా ఇళ్లల్లో కూడా కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.

వ్యవస్థీకృత నేరాలపై ప్రత్యేక దృష్టి

వ్యభిచారం, డ్రగ్స్, స్మగ్లింగ్ వంటి వ్యవస్థీకృత నేరాలపై ప్రత్యేక దృష్టి పెడతాం. అలాంటి సంఘటనలు ప్రజల దృష్టికి వస్తే మాకు తెలియజేయాలి. సైబర్ క్రైం అనేది కొత్త ప్రపంచం. ఇప్పుడు ఎక్కువ మంది ఆ నేరాల బారిన పడుతున్నారు. వాటిని నియంత్రించేందుకు పక్కా చర్యలు చేపడతాం.

జిల్లా పోలీస్ కార్యాలయంలో బాధ్యతల స్వీకరణ

జిల్లా నూతన ఎస్పీగా చందనాదీప్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎస్పీగా పనిచేసిన అపూర్వరావు సీఐడీ ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్పీగా బదిలీ అయిన సంగతి తెలిసిందే. ఆమె స్థానంలో 2012 బ్యాచ్‌కు చెందిన చందనా దీప్తి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు అడిషనల్ ఎస్పీ హనుమంతరావు, ఎస్‌బీ డీఎస్పీ సోమ్‌నారాయణ్ సింగ్, డీఎస్పీలు శ్రీధర్‌రెడ్డి, వెంకటగిరి, గిరిబాబు, డీఎస్పీ సైదా, జిల్లాలోని సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, డీపీఓ సిబ్బంది స్వాగతం పలికారు.

అయోమయానికి తెర

- ఆరు గ్యారంటీలపై ముఖ్యమంత్రి ప్రకటనతో స్పష్టత
- రైతుబంధు, పింఛన్లు పొందుతున్న వారిలో తొలగిన గందరగోళం



నల్లగొండ : అభయ హస్తం ఆరు గ్యారంటీల పథకాలకు సంబంధించి దరఖాస్తుల విషయంలో ప్రజల్లో నెలకొన్న అయోమయానికి తెర పడింది. ఇప్పటికే ఆసరా పింఛన్లు పొందుతున్నవారు, రైతు బంధు లబ్ధిదారులు ప్రస్తుతం మళ్లీ దరఖాస్తులు చేసుకోవాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండు రోజుల క్రితం చెప్పారు. దీంతో ఆయా పథకాల లబ్ధిదారుల సందిగ్ధతకు తెర పడినట్లయింది. అయితే రైతు భరోసా విషయంలో మాత్రం కౌలు రైతులకు పథకాన్ని ఎలా వర్తింజేస్తారనే విషయంలో మాత్రం స్పష్టత రాలేదు.

ఆచితూచి దరఖాస్తు..

ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలకు డిసెంబర్ 28 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఇప్పటికే రైతు బంధు, ఆసరా పింఛన్లు పొందుతున్నవారు ప్రస్తుత ఆరు గ్యారంటీల్లో రైతు భరోసా, పింఛన్లకు తిరిగి దరఖాస్తులు చేసుకోవాలా వద్దా అనే విషయంలో ఆందోళన నెలకొంది. సంబంధిత అధికారుల వద్ద కూడా వీటిపై స్పష్టత లేకపోవడంతో ఇప్పటివరకు కొందరు దరఖాస్తు చేసుకోగా మరికొందరు వేచి చూసే ధోరణిలో ఉన్నారు. ముఖ్యమంత్రి ప్రకటనతో వారంతా దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

వలస వచ్చిన వారి పరిస్థితి ఏమిటి?

బతుకు దెరువు కోసం కొన్నేళ్ల క్రితం జిల్లాలోని నల్లగొండతో పాటు మిర్యాలగూడ, దేవరకొండ తదితర పట్టణ, మండల ప్రాంతాలకు వలస వచ్చిన వారు చాలా మంది ఉన్నారు. అయితే వారు ఏళ్ల తరబడి ఇక్కడే ఉంటున్నా ఆధార్, ఇతర కార్డులు మాత్రం వేరే చోట ఉన్నాయి. అలాంటి వారు ఎక్కడ దరఖాస్తు చేసుకోవాలనే విషయం ఇంకా స్పష్టత లేకపోవడంతో ప్రజలు గందరగోళానికి గురవుతున్నారు. కొందరు ప్రస్తుతం ఉండే చోట, వారి ఊరిలో రెండు చోట్లా దరఖాస్తులు సమర్పిస్తున్నారు. అలాంటి వారి దరఖాస్తులు పరిశీలన సమయంలో రద్దవుతాయనే ఆందోళన నెలకొంది. ఇక, ఆధార్ కార్డులో పేర్లు, అడ్రస్ తప్పుగా ఉన్న వారు వాటిని మార్చుకునేందుకు మీసేవ, ఆధార్ కేంద్రాల వద్ద బారులుదీరుతున్నారు. అభయ హస్తం దరఖాస్తులకు మరో నాలుగు రోజులే అవకాశం ఉండటంతో ప్రజలు మీసేవ కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. దరఖాస్తుల స్వీకరణ గడువు పెంచాలని కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

మిర్యాలగూడ : పాఠశాలలను ప్రభుత్వం బలోపేతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలో జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సైదులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పది సంవత్సరాలుగా ప్రభుత్వ విద్యారంగం వివక్షకు గురి కావడంతో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య దూరమైందన్నారు. నూతన ప్రభుత్వం పూర్తిస్థాయిలో సమీక్షించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతలకు సంబంధించి కోర్టులో ఉన్న కేసులను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో జి.నాగమణి, పెరుమాళ్ల వెంకటేశం, బక్కా శ్రీనివాసచారి, అరుణ, శేఖర్‌రెడ్డి, రామలింగయ్య, శ్రీనివాస్‌రెడివ్ద, నర్సింహా, యాదగిరి, సైదులు, గిరి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

గ్యారంటీ అమలు చేయకుంటే అభాసుపాలే..



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభయహస్తం ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయకపోతే ప్రజల్లో అభాసుపాలు కావడం ఖాయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎం రాష్ట్ర ప్రతినిధి బృందంతో డిసెంబర్ 30న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ప్రజా సమస్యలపై వినతిపత్రాన్ని సమర్పించిందన్నారు. అందులో ప్రధానంగా అటవీ హక్కు చట్టం–2006 ప్రకారం పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, పేదలందరికీ ఇంటి స్థలం ఇచ్చి రూ.5లక్షలు ఇవ్వాలని, ఉద్యమాల సందర్భంగా కార్యకర్తలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని, సీలింగ్, మిగులు భూములను పేదలకు పంచాలని, ప్రతి గ్రామంలో ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని, సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని తదితర 15 అంశాలపై వినతిపత్రం అందించామన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు ఇండియా కూటమి సర్వశక్తులు ఒడ్డించి పోరాడుతుందన్నారు. సమావేశంలో నాయకులు డబ్బికార్ మల్లేష్, మల్లు గౌతంరెడ్డి, జగదీశ్చంద్ర, వీరేపల్లి వెంకటేశ్వర్లు, పరుశురాములు, రవినాయక్, రామ్మూర్తి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి

అర్వపల్లి : నూతన సంవత్సరంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కర్నాటక రాష్ట్ర హల్దిపూర్ వామనాశ్రమ పీఠాధిపతి, వైశ్య గురు మహాస్వామిజీ ఆకాంక్షించారు. రాష్ట్రంలోని తొలి సూర్యక్షేత్రమైన జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణ స్వామి క్షేత్రంలో సోమవారం ప్రవచనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లోకకల్యాణార్థం వాసవీమాతకు కోటి పుష్పార్చన కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైశ్యగురు సేవాసమితి సభ్యులు, క్షేత్ర నిర్వాహకులు పాల్గొన్నారు.



సూర్యక్షేత్రంలో మాట్లాడుతున్న పీఠాధిపతి మహాస్వామీజీ

గొర్రెల యూనిట్లపై సందిగ్ధం

- రెండో విడత కోసం ఏడాదిన్న క్రితం డీడీలు చెల్లించిన గొల్లకుర్మలు
- మునుగోడు ఎన్నికల కోడ్‌తో నిలిచిన పంపిణీ
- కొత్త ప్రభుత్వం ఇస్తుందో లేదోనని లబ్ధిదారుల్లో ఆందోళన



నల్లగొండ టౌన్: రెండో విడత గొర్రెల యూనిట్ల పంపిణీ పూర్తిగా నిలిచిపోయింది. రాష్ట్రంలోని గొల్లకుర్మలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సబ్సిడీ గొర్రెల యూనిట్ల పథకాన్ని ప్రవేశపెట్టింది. మొదటి విడతలో సుమారు 25 వేల మందికి గొర్రెలు పంపిణీ చేసింది. తిరిగి రెండో విడత గొర్రెల పంపిణీకి అప్పటి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో అధికారులు డీడీలు స్వీకరించారు. ఇదే సమయంలో మునుగోడు ఉప ఎన్నికలు రావడంతో డీడీలు చెల్లించిన వారిలో కొందరికే గొర్రెల యూనిట్లు పంపిణీ చేశారు. ఆ తర్వాత ఎన్నికల కోడ్ కారణంగా మిగతా వారికి పంపిణీ చేయలేదు.

డీడీలు చెల్లించింది ఇలా..

బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఏడాదిన్న క్రితం మునుగోడు ఉప ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 12,856 మంది గొల్లకుర్మల నుంచి జిల్లా పశు వైద్య సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో డీడీలు స్వీకరించింది. అనంతరం డీడీలు చెల్లించిన వారిలో 5,696 మంది లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లు పంపిణీ చేశారు. ఆ తర్వాత ఎన్నికల కోడ్ కారణంగా పంపిణీ నిలిచిపోవడంతో డీడీలు చెల్లించిన మిగతా 7,160 మంది లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లు అందించలేదు.

రెండో విడత వివరాలు ఇలా..

జిల్లా వ్యాప్తంగా డీడీలు చెల్లించిన వారు	పంపిణీ చేసిన గొర్రెల యూనిట్లు
12,856	5,696
అందించాల్సిన యూనిట్లు 7,160	

ఒక్కో లబ్ధిదారు వాటా ధనం రూ.43,750

గొర్రెల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం ఒక్కో లబ్ధిదారునికి యూనిట్ కింద 20 గొర్రెలతో పాటు ఒక పొట్టేలును అందించింది. వీటి విలువ రూ.1,58,000గా నిర్ణయించింది. అయితే ప్రభుత్వ సబ్సిడీ పోను దీంట్లో లబ్ధిదారుని వాటా ధనం కింద రూ.43,750లను డీడీల రూపంలో పశుసంవర్ధక శాఖకు చెల్లించారు. వడ్డీకి డబ్బులు తెచ్చి డీడీలు చెల్లించి ఏడాదిన్న కాలం కావొస్తున్నా నేటికీ గొర్రెల యూనిట్లు అందకపోవడంతో గొల్లకుర్మలు ఆందోళన చెందుతున్నారు. కొత్త ప్రభుత్వం కొలువు దీరినా గొర్రెల యూనిట్ల పంపిణీపై ఊసే ఎత్తకపోవడంతో అసలు గొర్రెలు ఇస్తారా లేదా అని గొల్లకుర్మలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మండల పశువైద్యాధికారులు, జిల్లా పశువైద్యాధికారి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదని చెబుతున్నారని డీడీలు చెల్లించిన గొల్లకుర్మలు అంటున్నారు. ఇప్పటికైనా తమ పరిస్థితిని అర్థం చేసుకొని వెంటనే గొర్రెల యూనిట్లు పంపిణీ చేయించాలని గొల్లకుర్మలు కొత్త ముఖ్యమంత్రిని కోరుతున్నారు.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు



"మునుగోడు ఉప ఎన్నికల ముందు గొర్రెల యూనిట్ల పంపిణీ నిలిచిపోయింది. డీడీలు చెల్లించిన వారు కార్యాలయాలకు తిరిగిపోతున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తే పంపిణీ ప్రక్రియ మొదలు పెడతాం.

– డాక్టర్ శ్రీనివాసరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు


మిర్యాలగూడ అర్బన్ : కేంద్ర ప్రభుత్వం నూతన సంవత్సరం కానుకగా పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించే అవకాశం ఉందనే వార్తల నేపథ్యంలో పట్టణంలోని పలు పెట్రోల్ బంక్‌ల యజమానులు నోస్టాక్ బోర్డులను ఏర్పాటు చేశారు. దీంతో అత్యవసరం ఉన్న వాహనదారులు పెట్రోల్, డీజిల్ కోసం వచ్చి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధరలు పెరిగిన సమయంలో మాత్రం అవసరానికి మించి దిగుమతి చేసుకుంటారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నోస్టాక్ బోర్డులు పెట్టకుండా పెట్రోల్, డీజిల్ అందుబాటులో ఉంచే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనాదారులు కోరుతున్నారు.



మిర్యాలగూడలో ఓ పెట్రోల్ బంకులో నో స్టాక్ బోర్డు

క్లుప్తంగా

వృథాగా సాగునీరు



వెల్లటూరు వద్ద వృథాగాపోతున్న నీరు

హుజూర్‌నగర్ (చింతలపాలెం): చింతలపాలెం మండలంలోని శివగంగా ఎత్తిపోతల పథకానికి సంబంధించిన సాగు నీటి పైపులు ఆదివారం లీకై నీరు వృథాగాపోయింది. పాత వెల్లటూరు గ్రామం సమీపంలోని జామాయిల్ తోట వద్ద వాటర్ పైపుల ప్లేటు పగిలి నీరు ఫౌంటేన్ లాగా పైకి ఎగజిమ్మింది. ఈ విషయమై జేఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా... నీటి ఒత్తిడికి పైపు ఎయిర్‌వాల్ ప్లేట్ పగిలిందని తెలిపారు. నీటి విడుదలను నిలుపుదల చేసి కొత్త ప్లేట్ బిగిస్తామని పేర్కొన్నారు.

8నుంచి ఎస్సారెస్పీ నీటి విడుదల

భానుపురి (సూర్యాపేట) : ఎస్సారెస్పీ ఆయకట్టుకు యాసంగి పంటల సాగు నిమిత్తం ఈ నెల 8వ తేదీ నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు ఎస్సారెస్పీ సూర్యాపేట ఈఈ భద్రు నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా ప్రాజెక్టులో నీటి లభ్యత అంతంత మాత్రంగానే ఉన్న నేపథ్యంలో యాసంగి ఆరుతడి పంటలకు మాత్రమే నీటిని ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ నెల 8నుంచి వారబందీ చొప్పున మార్చి 30వ తేదీ వరకు 6 తడులుగా నీటి విడుదల కొనసాగుతుందని చెప్పారు. అయితే చివరి ఆయకట్టు వరకు ఈ నీళ్లు చేరకపోవచ్చని తెలిపారు. రైతులు ఎవరూ వరి సాగు చేపట్టవద్దని, కేవలం ఆరుతడి పంటలనే సాగు చేసుకోవాలని కోరారు. వరి సాగు చేసి రైతులు నష్టపోవద్దని సూచించారు.

ధ్యానం.. సర్వోత్తమ మార్గం

భానుపురి (సూర్యాపేట) : విశ్వమానవాళికి శ్రీ అరవిందుల వారి తత్వ బోధనలు ఆచరణీయమని సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. సోమవారం నూతన సంవత్సర సందర్భంగా పట్టణంలోని జమ్మిగడ్డ శ్రీ అరవింద కేంద్రంలో నిర్వహించిన సామూహిక ధ్యాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. శ్రీ అరవిందుల వారి బోధనలోని సారాంశాన్ని గ్రహించడం ద్వారా అందరూ జ్ఞానమార్గంలో పయనిస్తూ సుఖశాంతులతో జీవించవచ్చన్నారు. కార్యక్రమంలో అరవింద కేంద్రం అధ్యక్షులు పోరెడ్డి మధుసూదన్ రెడ్డి, కొల్లు మధుసూదన్ రావు, పర్వతం శ్రీధర్, డాక్టర్ కరుణాకర్ రెడ్డి, ఉప్పల ఆనంద్, గజ్జల వెంకటరెడ్డి, గుండా జనార్దన్ రావు, నిమ్మల శ్రీనివాస్ గౌడ్, జెడ్పి వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ, మాజీ ఎమ్మెల్యే వేదాసు వెంకయ్య, దోసపాటి గోపాల్, మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

భూదాన్‌పోచంపల్లి: నూతన సంవత్సరం రోజున విషాదం చోటుచేసుకుంది. బైక్‌పై వెళ్తున్న యువకుడు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టుకు ఢీకొని మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం అర్థరాత్రి భూదాన్‌పోచంపల్లి పట్టణ పరిధిలోని భద్రావతికాలనీ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అంబేద్కర్ కోనసీమ జిల్లా సైదులుపేట గ్రామానికి చెందిన కిల్లంపల్లి నాగేంద్రకుమార్(23) తన భార్య మణిమాధురితో కలిసి బతుకుదెరువు నిమిత్తం ఏడాది క్రితం పోచంపల్లికి వచ్చారు. స్థానికంగా అద్దెకు ఉంటున్నారు. నాగేంద్రకుమార్ నారాయణగిరి సమీపంలోని ఓ రైస్‌మిల్లులో ఆపరేటర్‌గా పనిచేస్తుండగా, భార్య కూలీ పనులు చేస్తుంది. కాగా ఆదివారం రాత్రి రైస్‌మిల్లు వద్ద పని ఉందని నాగేంద్రకుమార్ తన భార్యకు చెప్పి బైక్‌పై వెళ్లాడు. తిరిగి అర్థరాత్రి 1.30 గంటల సమయంలో ఇంటికి వెళ్తుండగా భద్రావతీకాలనీ సమీపంలో మూలమలుపు వద్ద అతివేగంగా ఉన్న బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నాగేంద్రకుమార్‌కు తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విక్రమ్‌రెడ్డి తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన బొలేరో.. వ్యక్తి మృతి

కొండమల్లేపల్లి: నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొని బైక్‌పై ఇంటికి తిరిగి వెళ్తున్న వ్యక్తిని బొలేరో వాహనం ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం తెల్లవారుజామున కొండమల్లేపల్లి మండల కేంద్రంలో జరిగింది. మృతుడి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని 12వ వార్డులో నివాసముంటున్న గంజి శ్రీనివాస్(49), ధనలక్ష్మి దంపతులు స్థానికంగా అంబికా జనరల్ స్టోర్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె సంతానం. శ్రీనివాస్ ఆదివారం తన స్నేహితులతో కలిసి నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొనేందుకు బైక్‌పై దేవరకొండకు వెళ్లాడు. సోమవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో తిరిగి కొండమల్లేపల్లికి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో పెద్ద దర్గా వద్ద మల్లేపల్లి నుంచి దేవరకొండ వైపు వస్తున్న బొలేరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన శ్రీనివాస్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య ధనలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.



శ్రీనివాస్ (ఫైల్)

సూర్యాపేట జిల్లా కేంద్రంలో..

సూర్యాపేట క్రైం: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని హైటెక్ బస్టాండ్ ఎదురుగా జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడలో డెకరేషన్ వర్క్ చేసేందుకు హైదరాబాద్ నుంచి నటరాజ్, శ్రీనివాసులు, మల్లేష్ కారులో వెళ్తున్నారు. మల్లేష్ కారును నడుపుతూ సూర్యాపేట జిల్లా కేంద్రంలోని హైటెక్ బస్టాండ్ ఎదురుగా ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో నటరాజ్(41)కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మరో వ్యక్తి శ్రీనివాసులుకు స్వల్ప గాయాలయ్యాయి. గాయాలైన వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు.



ఘటనా స్థలిలో నటరాజ్ మృతదేహం

పురుగుల మందు తాగి బలవన్మరణం

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆత్మకూర్(ఎస్) మండలంలోని పాత సూర్యాపేట గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాత సూర్యాపేట గ్రామానికి చెందిన కోమటిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి (38) జీవనోపాధి నిమిత్తం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం గోపలాయపల్లిలో నివాసముంటున్నారు. ఇరవై రోజుల క్రితం శివమాల ధరించిన ప్రశాంత్‌రెడ్డి స్వగ్రామం పాత సూర్యాపేటలోనే ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో డిసెంబర్ 29న ప్రశాంత్‌రెడ్డి తన ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించగా సోమవారం మృతిచెందాడు. మృతుడికి భార్య పావని, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య పావని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

కుటుంబ కలహాలతో గడ్డి మందు తాగి..

పెన్‌పహాడ్: కుటుంబ కలహాలతో గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పెన్‌పహాడ్ మండల పరిధిలోని నాగులపహాడ్ గ్రామంలో సోమవారం జరిగింది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగులపహాడ్ గ్రామానికి చెందిన నకిరేకంటి సైదులు(36) కుటుంబ కలహాలతో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగాడు. చుట్టుపక్కల వారు గమనించి సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య శోభ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

నాంపల్లి: ఉరేసుకొని యువకుడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం నాంపల్లి మండల కేంద్రంలో వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి మండల కేంద్రానికి చెందిన వెంకటపురం యాదయ్య, లీలమ్మ దంపతుల కుమారుడు మధు(22) డిసెంబర్ 31వ తేదీ రాత్రి 9గంటల వరకు మండల కేంద్రంలోనే స్నేహితులతో గడిపి తర్వాత వెళ్లిపోయాడు. మధు తండ్రి యాదయ్య ఆటోలో రాత్రి 10.30ల సమయంలో తమ వ్యవసాయ బావి వద్ద మోటారు పెట్టడానికి వెళ్లగా.. మధు చెట్టుకు ఉరేసుకొని ఉండటం గమనించి గుండెలవిసేలా విలపించాడు. ఆటోలో ఇంటికి వచ్చి భార్యకు విషయం చెప్పి కుటుంబ సభ్యులతో కలిసి తిరిగి వ్యవసాయ బావి వద్దకు వెళ్లి మధు మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చారు. అప్పటి వరకు ఇంటి వద్దనే ఉన్న ఒక్కగానొక్క కుమారుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. మధు ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనపై ఎలాంటి సమాచారం అందలేదని ఎస్ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

స్కూటీని ఢీకొట్టిన కారు.. ఒకరికి గాయాలు

భువనగిరి క్రైం: స్కూటీని కారు ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం భువనగిరి మండలంలోని చందుపట్ల రోడ్డు వద్ద జరిగింది. వివరాలు.. భువనగిరి మండలం వీరవెల్లి గ్రామానికి చెందిన సుర్వి ఇస్తారిగౌడ్ స్కూటీపై చందుపట్ల నుంచి భువనగిరి పట్టణానికి వెళ్తుండగా చందుపట్ల సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇస్తారి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం అతడిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. గ్రామస్తుడు శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్..

వలిగొండ: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ట్రాక్టర్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ ఘటన వలిగొండ మండల కేంద్రం సమీపంలో సోమవారం జరిగింది. వివరాలు.. రామన్నపేట మండలం పల్లివాడకు చెందిన మేడి మహేష్ బైక్‌పై వలిగొండ మండలంలోని మల్లేపల్లిలోని తన బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా.. వలిగొండ–మల్లేపల్లి మధ్యలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహేష్ కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న ప్రయాణికులు 108 వాహనంలో క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పోలీసులకు సేవా పతకాలు



కాకి వెంకటరమణారెడ్డి



పాశం యాదగిరిరెడ్డి

చౌటుప్పల్: చౌటుప్పల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సూర్యాపేట జిల్లా మోతె మండలానికి చెందిన కాకి వెంకటరమణారెడ్డి, పోలీస్ సివిల్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నల్లగొండకు చెందిన పాశం యాదగిరిరెడ్డి పోలీస్ సేవా పతకాలకు ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. వెంకటరమణారెడ్డి మెడల్, రూ.30వేల నగదు బహుమతి, యాదగిరిరెడ్డి మెడల్, రూ.20వేల నగదు బహుమతి అందుకోకున్నారు. గణతంత్ర దినోత్సవం రోజున ఈ సేవా పతకాలను అందజేయనున్నారు.

నల్లగొండ జిల్లా నుంచి ఎంపికైంది వీరే..

నల్లగొండక్రైం : పోలీస్ శాఖలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను పలువురు పోలీస్ అధికారులకు సేవా పతకాలు, ఉత్తమ సేవా పతకాలను ప్రభుత్వం ప్రకటించింది. పతకాలకు ఎంపికైన పోలీసు అధికారుల జాబితాను సోమవారం విడుదల చేసింది. సేవా పతకాలు ప్రకటించిన జాబితాలో నల్లగొండ ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, ఏఆర్ ఎస్ఐ జంగయ్య, మిర్యాలగూడ రూరల్ కానిస్టేబుల్ లక్ష్మయ్య, బెటాలియన్‌లో ఆర్ఐలు సారంగపాణి, ఇమాన్యుయేల్, నల్లగొండ యూనిట్‌లో రిజర్వ్ వెకెన్సీ సీఐ షేక్ గౌస్, ఉత్తమ సేవా పతకంలో డీటీసీ హెడ్ కానిస్టేబుల్ విజయ్‌శేఖర్, బెటాలియన్‌కు చెందిన ఏఆర్ ఎస్ఐ జైపాల్‌రెడ్డి ఉన్నారు.

పెన్‌పహాడ్ పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్‌కు..

పెన్‌పహాడ్: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ ఆంగోతు యాదగిరి రాష్ట్ర సేవా పతకానికి ఎంపికయ్యారు. గణతంత్ర దినోత్సవం రోజున డీజీపీ చేతుల మీదుగా ఈ పతకం అందుకోనున్నట్లు సోమవారం ఆయన తెలిపారు.



ఆంగోతు యాదగిరి

జీవిత అనుభవాల నేస్తం 'డైరీ'

- డైరీ రాయడం అలవాటు చేసుకోవాలంటున్న విద్యావేత్తలు

నాగారం: కాలగమనంలో మారో ఏడాది గడిచిపోయింది. ఏడాది పొడవునా మదిని మరిపించిన మధురస్మృతులు ఓ వైపు.. జీవన గమనం నడిపిన అనుభవాల సారం మరోవైపు.. హృదయంలో మెదలుతుండగానే కోటి ఆశలు.. కొంగొత్త కోరికలతో 2024 నూతన సంవత్సరం దూసుకొచ్చింది. జ్ఞాపకాలను పదిలం చేయడంలోనే కాదు, సమాచారం అందించడంలోనూ డైరీలు ప్రముఖపాత్ర పోషిస్తాయి. కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లు హల్‌చల్ చేస్తున్న ఈరోజుల్లోనూ ఎంతో మంది డైరీలతో తమ అనుబంధాన్ని కొనసాగిస్తునే ఉన్నారు.

మనస్సాక్షికి ప్రతీక..

డైరీ మనస్సాక్షికి ప్రతీక. డైరీ రాయడమంటే మనలను మనం సరిచేసుకోవడమే. టెక్నాలజీ పేరుతో రోజుకో సరికొత్త యాప్‌లు, ఫేస్‌బుక్‌లు, వాట్సాప్‌లు, కంప్యూటర్లు రావడంలో ప్రజల్లో రోజురోజుకు డైరీ రాసే అలవాటు సన్నగిల్లుతోంది. డైరీలు రావడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని విద్యావేత్తలు, మానసిక విశ్లేషకులు చెబుతున్నారు. నిత్య జీవితంలో రోజు జరిగే కార్యకలాపాలు, గత అనుభావాలు, గడిచిన విషయాలు గుర్తు చేసుకోవడం, ముఖ్యమైన తేదీలు, ఆర్థిక లావాదేవీలు తదితర వాటికి డైరీ ఎంతో ఉపయోగపడుతుంది. డైరీలో రాసిన అంశాలను అప్పుడప్పుడు సమీక్షించుకుంటే మనం చేసిన తప్పుఒప్పులను సరిదిద్దుకోవచ్చు. మనలో అంతర్లీనంగా ఉండే సృజనను బయట పెట్టేందుకు దోహదపడుతుంది. రాసుకున్న అంశాలు సూటిగా, సరళంగా మనకు అర్థమయ్యేరీతిలో ఉండాలి.



ఆకర్షణీయంగా అందుబాటులో..

మార్కెట్‌లో వివిధ రకాల డైరీలు ఆకర్షణీయంగా అందుబాటులో ఉన్నాయి. మార్కెట్‌లో రూ.100 మొదలుకొని రూ.1000 వరకు ధరల్లో డైరీలు లభిస్తున్నాయి. వ్యాపారులు, యువత, విద్యార్థులు వివిధ రకాల వృత్తుల్లో ఉన్నవారి దృష్టిని ఆకర్షించే విధంగా రకరకాల డైరీలు మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చాయి.

డైరీ రాయడం మంచి అలవాటు



డైరీ రాయడం మంచి అలవాటు. డైరీని రాయడంతో మనజీవితంలో జరిగే ప్రతి సంఘటనను గుర్తుపెట్టుకోవచ్చు. కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లు ఎన్ని ఉన్నా డైరీకి మించినా ప్రత్యామ్నాయం మరొకటి లేదు. డైరీ రాయడంతో ప్రణాళికాబద్ధమైన జీవన గమనం ఏర్పడుతుంది.

– బి. బాలునాయక్, ఎంఈఓ, నాగారం

వ్యక్తిత్వ వికాసానికి దోహదం



వ్యక్తిత్వ వికాసానికి డైరీ ఎంతో దోహదపడుతుంది. డైరీలు రాయడం వల్ల లక్ష్య సాధన సులభమవుతుంది. ఉద్యోగరీత్యా డైరీ రాయడం తప్పనిసరి. మనిషి జీవితంలో డైరీకి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఎన్ని ఒత్తిళ్లు ఉన్నా రోజు డైరీ రాయడం అలవాటు చేసుకోవాలి.

– సైదులు గౌడ్, ఎస్ఐ, నాగారం

ఎన్నో లాభాలు ఉన్నాయి



రోజు వారీగా డైరీ రాయడం వలన ఎన్నో లాభాలు ఉన్నాయి. గత జ్ఞాపకాలు, మనలో వచ్చే మార్పులు బేరీజు వేసుకోవడానికి కూడా డైరీ ఎంతో దోహదపడుతుంది. రోజు వారి కార్యకలాపాలు, పనులు, ఆర్థిక లావాదేవీలు నిర్వహించుకోవడానికి డైరీ ఎంతో ముఖ్యం.

– కత్తుల వెంకన్న, మీసేవా నిర్వహకుడు, నాగారం

బోర్డు మెంబర్‌గా సైదులు

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): బీఎస్ఎన్ఎల్ టెలికం అడ్వైజరీ కమిటీ బోర్డు మెంబర్‌గా మండల పరిధిలోని గట్టికల్లు గ్రామానికి చెందిన సంద్యాల సైదులు ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆయన బీజేపీ జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

• ప్రయాణికుల ప్రయాస



కొండ పైన బస్టాండ్‌లో బస్సుల కోసం వేచిచూస్తున్న భక్తులు

కొత్త సంవత్సరం సందర్భంగా యాదాద్రి క్షేత్రానికి భక్తులు సోమవారం పెద్ద సంఖ్యలో వచ్చారు. దీంతో కొండ పైన ఉన్న బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ పెరిగింది. సరిపడా బస్సులు లేక వచ్చిన బస్సుల్లో వెళ్లేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, యాదాద్రి భువనగిరి



చిన్నారిని బస్సు కిటికీలో నుంచి ఎక్కిస్తున్న ప్రయాణికుడు

• పర్యాటకుల సందడి



రాయగిరి చెరువు వద్ద సేదదీరుతున్న పర్యాటకులు



భువనగిరి ఖిలాపై సందర్శకులు

నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా భువనగిరి ఖిలాతో పాటు రాయగిరి చెరువు కట్టపై పర్యాటకులు సందడి చేశారు. యాదాద్రీశుడి దర్శనానికి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకున్న తర్వాత రాయగిరి చెరువు వద్ద ఆహ్లాదంగా గడిపారు. భువనగిరి ఖిలాపై సెల్ఫీలు, ఫొటోలు తీసుకునేందుకు పోటీ పడ్డారు.

– భువనగిరి

పాడి పశువుల ఎంపికలో జాగ్రత్తలు అవసరం

- పెద్దవూర మండల పశువైద్యాధికారి చంద్రబాబు

పాడి పంట

పెద్దవూర: రైతులు, పాడి పశువుల నిర్వాహకులు మేలు జాతి పశువుల ఎంపికలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని పెద్దవూర మండల పశువైద్యాధికారి డాక్టర్ పిట్టల చంద్రబాబు తెలిపారు. మేలు జాతి పశువు శరీర లక్షణాలు, పశువు వంశావళి, సంతతి, పశువు ఉత్పత్తి సామర్థ్యం అనే విషయాలను అవగాహన చేసుకుని కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు.

పశు సంతతి గుర్తింపు ఇలా..

యజమానులు పశువు తల్లి, తండ్రి ఉత్పత్తి సామర్థ్యం వాటి పాల ఉత్పత్తి ఆరోగ్య చరిత్ర తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. వీటిని బట్టి సంతానం సామర్థ్యం అంచనా వేయవచ్చు. పశువులకు సంబంధించిన ఇలాంటి వివరాలు పెద్ద పెద్ద ఫారాలు, ప్రభుత్వ ఫారాల్లో మాత్రమే లభ్యమవుతాయి. పశువుల గరిష్ఠ స్థాయి పాల దిగుబడి పశువు ఈనిన 40–60 రోజుల లోపల ఉంటుంది. గరిష్ఠస్థాయికి త్వరగా చేరి, గరిష్ఠ స్థాయిలో ఎక్కువ రోజుల్లో పాల దిగుబడి ఇవ్వగలిగిన పశువులే లాభదాయకంగా ఉంటాయి.



మేలు జాతి పశువుల శరీర లక్షణాలు

పాడి పశువులు నిండుగా, చురుకుగా ఆడ లక్షణాలు కలిగి ఉండాలి. పాడి పశువులు సులువుగా ఉండాలి కానీ ఎద్దులాగా బాగా కండపట్టి ఉండకూడదు. శరీర అంగ సౌష్టవం త్రికోణాకారము కలిగి ఉండటంతో పాటు చర్మం పలుచగా, మదువుగా ఉండాలి. లాగితే ముడత సులువుగా రావాలి. వదిలితే యథాస్థానంలో ఉండాలి. తేలికగా నడవగలిగి సులువుగా కూర్చుని లేవాలి. కళ్లు చురుకుగా విశాలంగా ఉండి ముట్టె చెమ్మగిల్లి ఉండాలి. మెడ పొట్టిగాను, సన్నగాను, ఉండి ఛాతీ భాగం విశాలంగా ఉండాలి. డొక్కలు నిండుగాను, కడుపు పెద్దదిగాను, పక్కటెముకలు బాగా వంచిన విల్లు ఆకారంలో ఉండాలి. పశువుల పిరుదుల భాగం వెనుక వైపు పొంగి ఉంటే సులభంగా ఈనగలదని గ్రహించాలి. అంతేకాకుండా కాళ్లు దృఢంగా ఉండి కాలి గిట్టలు వెడల్పుగా, గుండ్రంగా ఒక దానికి ఒకటి దగ్గరగా ఉండాలి.

మొదటి, రెండో ఈత పశువులనే కొనుగోలు చేయాలి

అక్టోబర్, నవంబర్ మాసాలు పాడి పశువులను కొనటానికి అనువైన నెలలు. పశువు ఈనిన తర్వాత నెలా, నెలా పదిహేను రోజుల లోపల అత్యధికంగా పాల దిగుబడి ఇస్తుంది. ఈనిన నెలలోపు పశువులనే ఖరీదు చేయాలి. పశువుల మొదటి 5 ఈతల్లో గరిష్ఠస్థాయి పాల దిగుబడి ఇస్తాయి. మొదటి ఈత, రెండవ ఈత పశువులను మాత్రమే కొనుగోలు చేయాలి. ముర్రా గేదె సరాసరి 10–12 లీటర్లు, గ్రేడెడ్ ముర్రా గేదె అయితే 6–7 లీటర్ల పాలు ఇస్తే గిట్టుబాటు అవుతుంది.

పశువులను కొనేటప్పుడు చూడాల్సిన అంశాలు

- జాతి, పశువు శరీర లక్షణాలు, బరువు, కొలతలు
- తండ్రి వారసత్వం, తల్లి వారసత్వం, దిగుబడి శక్తి, పునరుత్పత్తి శక్తి, గతంలో పుట్టిన దూడల శక్తి
- పశువు ఆరోగ్య పరిస్థితి, వయస్సు, ఎన్ని ఈతలు ఈనినది, దీర్ఘకాలిక వ్యాధులకు దూరంగా ఉందా లేదా గమనించాలి.
- పళ్లు శుభ్రంగా ఉన్నాయా, కాళ్లు, డెక్కల్లో బెణుకులు, విరుగుడు ఏమైనా ఉన్నాయో చూసుకోవాలి.
- చూపు సరిగా ఉందా, వట్టిదా, చూడిదా, పాడిదా గమనించాలి.
- చూడిదైతే చూడి ఎన్ని నెలలు, ఏ ఆబోతుతో కలిపారు.
- వట్టిదైతే ఎదకు వచ్చిందా, ఎన్నిసార్లు, ఎద నిలువలేదా, చివరిసారి వచ్చిన తేదీ, వైద్యం చేయించారా అనేది తెలుసుకోవాలి.

పొదుగు లక్షణాలు

పొదుగు బాగా విస్తరించి శరీరానికి హత్తుకుని ఉండాలి. పొదుగు 18 అంగుళాల పైనే ఉండాలి. చనుకట్ల పొదుగు మీద సమానంగా అమరి ఉండటంతో పాటు పొదుగు ఇరువైపులా రక్తనాళాలు స్పష్టంగా కనిపించాలి. ఎక్కువ వంకర్లు తిరిగి ఉంటే అన్ని పాలను ఎక్కువగా ఇవ్వగలవని గుర్తించాలి.